## క్లుప్తంగా

### మహాలక్ష్మి అమ్మవారికి మల్లెపూల అలంకరణ

**కంచికచర్ల:** స్థానిక మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు కాకాని పవన్‌కుమార్ శర్మ, కాకాని హనుమత్ సుమన్ శర్మలు అమ్మవారికి బోనాల మహోత్సవం సందర్భంగా విశేష పూజలు చేశారు. అమ్మవారికి మల్లెపూలతో చీర అలంకరణ చేశారు. అమ్మవారికి సహస్ర దీపాలంకరణ, విశేష పూజలు చేశారు. అదేవిధంగా లలితా సహస్ర నామ పూజలు, నీరాజన మంత్ర పుష్పములు, మహన్యాసపూర్వక అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. రాత్రి సమయంలో జరిగిన పూజా కార్యక్రమానికి అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు ఆలయానికి తరలివచ్చి అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

### 110 మందికి కంటి పరీక్షలు



**మక్కపేట(భీమవరం):** కొమరగిరి ట్రస్టు, చిన్న అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని శ్రీ సాయిసెంచరీ హైస్కూల్ ఆవరణలో జరిగిన ఈ శిబిరంలో మక్కపేట, చిట్టేల, శింగవరం, కన్నెవీడు, గోపినేనిపాలెం గ్రామాలకు చెందిన మొత్తం 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 14 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఆపరేషన్లు చేయించుకునే వారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత వాహనంలో వైద్యశాలకు తరలించారు. ఆపరేషన్లు పూర్తయ్యాక నేరుగా వారి ఇళ్ల వద్దనే దించడం జరుగుతుందని ట్రస్టు అధ్యక్షుడు కొమరగిరి రవీంద్రభరద్వాజ్ తెలిపారు. కార్యక్రమంలో సాయిసెంచరీ ప్రిన్సిపాల్ కె.సవిత తదితరులు పాల్గొన్నారు.

### రైతులు పంట నమోదు చేసుకోవాలి

**కంచికచర్ల:** రైతులు సాగుచేసిన పంటలను ముందుగానే నమోదు చేయించుకోవాలని ఎంఏవో కే విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని పరిటాల, గనిఆత్కూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంట సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక ఫలసాయం పొందవచ్చని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించటమే ధ్యేయంగా రైతులను ముందుకు నడిపించటమే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య నమోదు చేయటం జరుగుతుందని, ఈనెల 25వ తేదీ లోగా ఫార్మర్ ఐడీని నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు పంట నమోదు ఆవశ్యకత, అనంతరం వ్యవసాయశాఖ అధికారులు రైతులతో కలిసి మిర్చి, పత్తి, మంచి శనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి నీలిమ, గ్రామీణ వ్యవసాయ సహాయకులు సాహిత్య, రఘు, రైతులు పాల్గొన్నారు.

### సీఆర్పీఎఫ్ కో కన్వీనర్ నియామకం



**జగ్గయ్యపేట అర్బన్:** ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ ఫోరం కో కన్వీనర్‌గా సామాజికవేత్త పెంటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విజయవాడలో నిర్వహించిన మొదటి సమావేశంలో రాష్ట్ర కమిటీలో కో కన్వీనర్‌గా పెంటి శ్రీనివాసరావుకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం పెంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ ఫోరం 2004 నుంచి జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల్లో ఎంవీ ఫౌండేషన్ సౌజన్యంతో పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ సీఆర్పీఎఫ్ కన్వీనర్ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ధనసిరి ప్రకాష్, రాష్ట్రంతో పాటు అన్ని జిల్లాల నుంచి ఫోరం ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు.

### దుకాణాల వేలంతో రూ. 3.34 లక్షల ఆదాయం

**నందిగామ రూరల్:** మహాశివరాత్రి పండుగ సందర్భంగా నాలుగు రోజుల పాటు జరిగే తిరునాళ్ల మహోత్సవాలకు సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.3.34 లక్షల ఆదాయం వచ్చిందని గ్రామ కార్యదర్శి జీవనజ్యోతి, సర్పంచ్ గాదెల వెంకట రామారావు పేర్కొన్నారు. మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో వేంచేసియున్న పర్వతవర్ధిని సంగమేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలో పలు రకాల దుకాణాలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిఠాయి, బొమ్మల షాపులు, కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, గాజులు, స్టీలు సామాను, పలు రకాల దుకాణాలు నిర్వహించు కునే హక్కుకు వేలం నిర్వహించగా ఆ మేరకు ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు నీడ కరువు

- పుణ్యక్షేత్రం పెనుగంచిప్రోలులో భక్తుల ఇక్కట్లు
- నిత్యం వేలాదిమంది రాక
- రోడ్ల పక్కనే బస్సుల కోసం ఎదురు చూపులు
- వేసవి, వర్షా కాలాల్లో ప్రయాణికుల ఇబ్బందులు



పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో దుకాణాల ముందు వేచి ఉన్న ప్రయాణికులు



శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద నిరుపయోగంగా బస్‌షెల్టర్

**పెనుగంచిప్రోలు:** పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలులో బస్టాండ్ లేక పోవటంతో ప్రయాణికులు రోడ్లపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఇక్కడి నుంచి జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ, ఖమ్మం, హైదరాబాద్‌లకు రోజూ జగ్గయ్యపేట, విజయవాడ, ఖమ్మం, డిపోల నుంచి 50 సర్వీసుల వరకు బస్సులు ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి.

#### ప్రాధాన్యత ఇదీ..

పెనుగంచిప్రోలు మండల కేంద్రం. శ్రీతిరుపతమ్మ అమ్మవారి పుణ్యక్షేత్రం. అయినా నేటి వరకు బస్టాండ్ లేదు. పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, మధిర, ఖమ్మం వెళ్లే ప్రయాణికులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లే సుబ్బాయిగూడెం, కొళ్లికూళ్ల, వెంకటాపురం, శనగపాడు, ముండ్లపాడు, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు, శివాపురం గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, వత్సవాయి మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.

#### దుకాణాలే దిక్కు..

క్రాస్‌రోడ్స్ వద్ద కూడా బస్‌షెల్టర్లు లేవు. ప్రయాణికులు టీదుకాణాలు, ఇతర వ్యాపార దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఆలయం వద్ద రేకులతో వేసిన బస్‌షెల్టర్ ప్రయాణికులకు సరిపోవటం లేదు. ప్రస్తుతం అక్కడ అభివృద్ధి పనులు జరుగుతుండటంతో వినియోగంలో లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అవసరమైన చోట గ్రామంలో బస్టాండ్ నిర్మించాలని కోరుతున్నారు.

#### మహిళలు ఇబ్బంది పడుతున్నారు



పెనుగంచిప్రోలులోని నాలుగు రోడ్ల కూడలి పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో బస్‌షెల్టర్ నిర్మించాలి. షెల్టర్లు లేక పోవటంతో ఎండకు రోడ్లపై నిల్చోలేక పోతున్నారు. మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వివిధ గ్రామాలకు వెళ్లే వారంతా రోడ్ల పక్కన దుకాణాల ముందు నిలబడాల్సి వస్తోంది.

– టి.సుభాషిణి, ప్రయాణికురాలు

#### అధికారులు స్పందించాలి..



బస్‌స్టాండ్ నిర్మాణం విషయంలో అధికారులు స్పందించాలి. ప్రజాప్రతినిధులు కూడా ఈ సమస్యపై దృష్టి సారించాలి. ఎండావానలకు ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, పిల్లలతో అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలి.

– కొమ్ముకూరి వెంకటరత్నం, ప్రయాణికుడు

#### పోలీస్ స్టేషన్ సెంటర్ కీలకం..

నాలుగు రోడ్ల కూడలి అయిన పోలీస్ స్టేషన్ సెంటర్‌లో ప్రయాణికులు రోడ్ల పక్కన నిలుచొని బస్సుల కోసం వేచి ఉంటారు. వీరిలో మహిళలు, పిల్లలు బాత్‌రూమ్‌కు వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి. దీంతో వారు పడే బాధలు చెప్పలేనివి. పాత పోలీస్‌స్టేషన్ స్థలంలో మరుగుదొడ్లు నిర్మిస్తే ఇబ్బందులు తొలుగుతాయంటున్నారు.

#### స్థలం ఇస్తే..

పాత పోలీస్‌స్టేషన్ స్థలంలో కొంత కేటాయిస్తే కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మించటానికి తాము సిద్ధంగా ఉన్నాం. పాత పోలీస్‌స్టేషన్ స్థలంలో మినీ బస్టాండ్ కడతారని గతంలో ప్రచారం జరగటంతో కొలతలు కూడా తీశారు. కానీ కార్యరూపం దాల్చలేదు.

–కె.శ్యామ్, పంచాయతీ కార్యదర్శి, పెనుగంచిప్రోలు

## మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు గృహ నిర్బంధం



గృహ నిర్బంధంలో మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు



మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఇంటి ముందు పోలీసులు

#### విజయవాడ వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

**నందిగామ టౌన్ (నందిగామ రూరల్):** మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును మంగళవారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. విజయవాడ జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పరామర్శించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తుండటంతో ఆ కార్యక్రమానికి వెళ్లనీయకుండా పోలీసులు ఇంటి ఎదుట మోహరించారు. అనంతరం ఉన్నతాధికారుల నుంచి జగన్‌మోహనరావు విజయవాడ వెళ్లేందుకు ఆదేశాలు రావటంతో పోలీసులు వెళ్లిపోయారు. దీనిపై జగన్‌మోహనరావు మాట్లాడుతూ పోలీసులు, గృహ నిర్బంధాలతో ప్రజా పోరాటాలను, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి కార్యక్రమాలను ఆపలేరన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓర్సు జ్వాలా, నెలకుదిటి శివనాగేశ్వరరావు, షేక్ యాకుబ్ అలీ, మాడుగుల మనోహర్, పలువురు నాయకులు ఉన్నారు.

## సీఎం సహాయనిధి పత్రాలు అందజేత



ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

**జగ్గయ్యపేట అర్బన్/నందిగామ రూరల్:** జగ్గయ్యపేట నియోజకవర్గం, నందిగామ మండలం, రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గూడపాటి చైతన్య అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడానికి సరిపడా డబ్బులు లేకపోవడంతో ఎమ్మెల్యే తాతయ్య దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆయన రిఫరెన్స్ లెటర్ ద్వారా ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన రూ.4,62,983 ఎల్‌వోసీని బాధిత కుటుంబ సభ్యునికి ఎమ్మెల్యే తన నివాసంలో మంగళవారం అందజేశారు. జగ్గయ్యపేట మండలం, బూదవాడ గ్రామానికి చెందిన ఆవుల సావిత్రికి మంజూరైన రూ.60,000 ఎల్‌వోసీని బాధిత కుటుంబ సభ్యునికి అందజేశారు. నాయకులు కోరంపల్లి నాగేశ్వరరావు, గాడిపర్తి శ్రీనివాసరావు, లగడపాటి బాబి, కొత్తపల్లి బ్రహ్మం, బోడెంపూడి గోపి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి

**నందిగామ టౌన్ (నందిగామ రూరల్):** సొంత వ్యవసాయ పొలం ఉన్న రైతులు తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని ఎస్‌ఎస్పీ డీసీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ఆయన కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ రైతు విశిష్ట సంఖ్య ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, రాయితీలు అందుతాయన్నారు. ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని కోరారు.

## మహాశివరాత్రి తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నూతక్కి సురేష్‌బాబు

**నందిగామ రూరల్:** మహాశివరాత్రి సందర్భంగా నాలుగు రోజుల పాటు జరిగే తిరునాళ్ల మహోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని తహసీల్దార్ నూతక్కి సురేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో వేంచేసియున్న పర్వతవర్ధిని సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగే తిరునాళ్ల ఉత్సవాలపై మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి తిరునాళ్ల మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా ఉత్సవాలను జరిపించాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని చెప్పారు. సీఐ వైవీఎల్ నాయుడు మాట్లాడుతూ పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం, మజ్జిగ, తాగునీటి సరఫరాకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయని ఈవో నరసింహ మూర్తి చెప్పారు. సర్పంచ్ గాదెల వెంకట రామారావు మాట్లాడుతూ ఆలయ పరిసరాలలో మద్యం, మాంసం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ కార్యదర్శి జీవనజ్యోతి, నాయకులు చెరుకూరు హైమారావు, గింజుపల్లి శ్రీనివాసరావు, తోట నాగ మల్లేశ్వరరావు, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గంజాయి, సారా విక్రయిస్తే సమాచారం ఇవ్వండి

**కంచికచర్ల:** గంజాయి, సారా, మాదక ద్రవ్యాలు విక్రయించినా, తరలించినా టోల్‌ఫ్రీ నంబర్ 14405కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ షేక్ అఫ్రపున్నీసా బేగం అన్నారు. కంచికచర్ల ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో మంగళవారం సీఐ మాట్లాడుతూ కంచికచర్ల, నందిగామ ప్రాంతాల్లో ఎక్కువగా ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయని, విద్యార్థుల భవిష్యత్ బాగుండాలంటే గంజాయి, సారా విక్రయాలు జరుగకుండా చూడాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లేకపోతే విలువైన జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడతాయని అన్నారు. ఈ ప్రాంతంలో గంజాయి, సారా విక్రయాలు, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తరలించి, విక్రయించినా అటువంటి వారిపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఎస్ఐ గాలిబ్ సాహెబ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### అన్నదానానికి రూ.10 వేలు వితరణ



**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మంగళవారం పల్నాడు జిల్లా, నరసరావుపేటకు చెందిన తమనం భాస్కరరావు, విజయలక్ష్మి దంపతులు రూ.10 వేలను వితరణ చేశారు. ఆలయ అధికారుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

## బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రాధమ్మ



రాధమ్మకు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి

**జగ్గయ్యపేట అర్బన్:** ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన పోలంపల్లి రాధమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు, హైకోర్టు న్యాయవాది వేములు బేబీరాణి నుంచి నియామకపత్రం అందుకున్నట్లు పోలంపల్లి రాధమ్మ మంగళవారం తెలిపారు.

## అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవాలి

**వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్**



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్

**జగ్గయ్యపేట అర్బన్:** స్థానిక పురపాలక సంఘం పరిధిలో అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకొని, వారికి సహకరిస్తున్న మున్సిపల్ అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మనోహర్ మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావును ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు, కమిషనర్‌కు, టీపీవోకు, మున్సిపల్ చైర్మన్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, కౌన్సిల్ సమావేశాలలో వాటి గురించి మాట్లాడినప్పటికీ చెవిటివాని ముందు శంఖం ఊదినట్లుగా ఉందన్నారు. పట్టణం నుంచి బలుసుపాడు వెళ్లే రోడ్‌లో ఏర్పాటుచేసిన అక్రమ లేఅవుట్లను సర్వే నంబర్లతో సహా ఫిర్యాదులు చేసినా పరిశీలించలేదన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)కు కూడా మున్సిపల్ కమిషనర్ ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదన్నారు. ఈ వ్యవహారంలో సంబంధమున్నవారు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ అక్రమాలపై భవిష్యత్‌లో వైఎస్సార్ సీపీ తరపున కోర్టు కేసులు, లీగల్ చర్యలకు పూనుకుంటామని తెలిపారు.

## 'పీఎం సూర్యఘర్'పథకంపై అవగాహన



గ్రామంలో సూర్యఘర్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న ఎంపీడీవో, తదితరులు

**షేర్‌మహమ్మద్‌పేట(జగ్గయ్యపేట):** పీఎం సూర్యఘర్ యోజన పథకంపై మంగళవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సూర్యఘర్‌పై అవగాహన ర్యాలీలను విస్తృతం చేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా రాయితీపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుని విద్యుత్‌బిల్లులు తగ్గించుకోవచ్చన్నారు. ఇప్పటికే అన్ని బ్యాంకుల అధికారులు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు రాయితీపై రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం పథకం వివరాలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ లోకేష్‌కుమార్‌ను కలిసి రాయితీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ, కార్యదర్శి నాగులు, వెలుగు వీపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసు బనాయించారని నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**జగ్గయ్యపేట అర్బన్:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. మైలవరం మండలం, మొరుసుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ములకలపెంట గ్రామంలో ఈనెల 8వ తేదీన జరిగిన హత్య కేసులో ఎటువంటి సంబంధం లేని వడ్లపూడి సంసోను మాదిగను మైలవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా హింసించి అక్రమ కేసులు బనాయించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి దావీదు మాదిగ మాట్లాడుతూ సంసోనుపై అక్రమ కేసు బనాయించడమే కాకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పేట మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చింతిరాల గోపి, ముక్త్యాల, బలుసుపాడు ఎమ్మార్పీఎస్ నాయకులు యాంపొంగు ఆదాం, అమ్మనబోయిన నాగరాజు, సంఘ నాయకులు వేమవరపు అర్లయ్య, కోట ప్రభుజీ, ఉలవలపూడి సునీల్, అన్నెపాగ దుర్గ, పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలి

- నందిగామ ఆర్డీవో బాలకృష్ణ
- కల్యాణోత్సవాలపై సమీక్ష సమావేశం



ఆలయం వద్ద ట్రాఫిక్ స్థలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, ఐపీఎస్ అధికారి మనీషా రెడ్డి

**ముక్త్యాల(జగ్గయ్యపేట):** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ హెచ్చరించారు. గ్రామంలోని భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 23 నుంచి మార్చి మూడోతేదీ వరకు జరిగే స్వామి వారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ మహోత్సవాలలో ముఖ్య ఘట్టమైన 26న జరిగే మహాశివరాత్రికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసేందుకు తరలివస్తారన్నారు. ఇందు కోసం ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. నది ఘాట్‌ల వద్ద పారిశుద్ధ్య చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. మహిళల కోసం ప్రత్యేకంగా దుస్తులు మార్చుకునే గదులతో పాటు మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. నదిలో గజ ఈగాళ్లను, 14 బోట్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పులిచింతల నుంచి దిగువకు అవసరాన్ని బట్టి నీటిని విడుదల చేసేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శివరాత్రి రోజున ట్రాఫిక్ నియంత్రణ, నది వద్ద జల్లు స్నానాలను ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయ అధికారులు కూడా అన్ని శాఖల అధికారులకు సహకరించాలన్నారు. చిల్లకల్లు ట్రైనీ ఎస్ఐ, ఐపీఎస్ అధికారి మనీషారెడ్డి మాట్లాడుతూ ఉత్సవాలకు ప్రత్యేకంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని, నదీ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ స్థలాలను పరిశీలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూస్తామని చెప్పారు. రెండు డ్రోన్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. మహిళా పోలీసులు, హోంగార్డులు, ఎస్ఐలు, సీఐ, డీఎస్పీలు బందోబస్తులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా మద్యం విక్రయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆర్టీసీ బస్సులు 27 ఏర్పాటు చేస్తున్నామని, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐదు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు చెప్పారు. అనంతరం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నితిన్, ఆర్ఐ సూరమ్మ, ఎస్ఐ రాజు, వైద్య, ఇరిగేషన్, మత్స్య, ఎక్సైజ్, ఆర్టీసీ అధికారులు, ఈవో సురేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

**పెనుగంచిప్రోలు:** నాణ్యమైన విద్యే లక్ష్యంగా పని చేయాలని ఎంఈఓ డి. రవీంద్ర అన్నారు. స్థానిక కేవీఆర్‌జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఎఫ్ఎల్ఎస్ కార్యక్రమంలో భాగంగా జ్ఞానజ్యోతి పేరుతో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు ఈనెల 20వ తేదీ వరకు మొదటి విడత, 22 నుంచి 25 వరకు రెండో విడత జరుగుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, సువర్ణ, రిసోర్స్ పర్సన్లు పాము నాగేశ్వరరావు, ప్రకాష్‌లు ఐసీడీఎస్ సేవలు, లక్ష్యాలు, ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలు వివరించారు.